కమ్మేసిన కంప

- మల్లంకుంట చెరువుపై ప్రమాదకంగా..

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విశాలంగా ఉన్న మల్లంకుంట చెరువుకట్ట

ఏపుగా పెరిగిన కంప చెట్లు

అచ్చంపేటటౌన్, జూన్ 24 : పట్టణంలోని మల్లంకుంట చెరువుకట్టపై రోడ్డుకు అడ్డంగా కంపచెట్లు పెరగడంతో సాయినగర్ నుంచి వివిధ అవసరాల నిమిత్తం పట్టణంలోనికి వచ్చే వారికి చాలా ఇబ్బందులు కలుగుతున్నాయి. తెలంగాణ రాక ముందు చినుకుపడితే మల్లంకుంట చెరువుపై నుంచి వెళ్లడానికి వీలులేకుండా ఉండేది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ పాలనలో అప్పటి ఎమ్మెల్యే గువ్వల బాలరాజు చొరవతో మల్లంకుంట చెరువు కట్టపై సీసీరోడ్డు నిర్మాణం చేపట్టారు. దీంతో వాహనదారులకు, విద్యార్థులకు ఎలాంటి ఆటంకం లేకుండా వారి గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. కానీ ప్రస్తుతం అదే దారి గుం డా వెళ్లాలంటే భయభ్రాంతులకు గురయ్యే విధంగా మారిందని ప్రజలు చర్చించుకుంటున్నారు. రహదారి పొడువునా ముళ్ల చెట్లు రోడ్డుకు అడ్డంగా పెరగడంతో రాకపోకలకు అంతరాయంగా మారిందని ప్రజలు వాపోతున్నారు. అదేవిధంగా రహదారి చుట్టుపక్కల అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారే అవకాశముంద ని అధికారులు చొరవ తీసుకొని రహదారి వెం బడి ఉన్న ముళ్లపొదలను తొలగించి రాకపోకలకు అంతరాయం లేకుండాచూడాలని కోరారు.

నల్లమలలో డిప్యూటీ సీఎంకు స్వాగతం

భట్టి విక్రమార్కకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్, ఎస్పీ

అమ్రాబాద్/వెల్దండ, జూన్ 24 : తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క దంపతులు సోమవారం శ్రీశైలం దైవ దర్శనానికి వెళ్తూ మార్గమధ్యలో అమ్రాబాద్ మండలం మన్ననూర్‌లో కొద్దిసేపు ఆగారు. మంత్రి జూపల్లి కృష్ణారావు, అచ్చంపేట, నాగర్‌కర్నూల్, వనపర్తి, కల్వకుర్తి, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యేలు డాక్టర్ వంశీకృష్ణ, రాజేశ్‌రెడ్డి, మేఘారెడ్డి, కసిరెడ్డినారాయణరెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ బడావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్‌వైభవ్ రఘునాథ్, డీఎఫ్‌వో, ఇన్‌చార్జి ఐటీడీఏ పీవో రోహిత్‌గోపిడి, ఆర్డీవో మాధవి, అధికారులు, నాయకులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. కొద్దిసేపు స్థానికనేతలతో మాట్లాడారు. అనంతరం శ్రీశైలం దైవదర్శనానికి బయలుదేరారు. అంతకుముందు మన్ననూర్ నిరంజన్‌షావలి దర్గాను సందర్శించారు. లింగమయ్య ఆలయంలో పూజలు చేశారు. అలాగే వెల్దండలో ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్కకు కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. సోమవారం హైదరాబాద్ నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వెళ్తున్న విషయం తెలుసుకున్న స్థానిక నాయకులు వెల్దండలో అంబేద్కర్ విగ్రహం వద్ద జాతీయ రహదారిపై ఘన స్వాగతం పలకడంతో ఆయన వాహనాన్ని నిలిపి ఎమ్మెల్యే కశిరెడ్డినారాయణరెడ్డి, నాయకులతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వే సి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాసులు, వైస్‌ఎంపీపీ ప్రణీత నాయకులు బుచ్చయ్య, శ్రీనివాసులు, రాజేంద్రప్రసాద్, రహీమ్, నాసరయ్య, మల్లికార్జున్, చత్రునా యక్, బాలింగంగౌడ్, నరహరి, సంతోష్, రాజేందర్, రాజ్‌గోపాల్, వెల్దండ మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి, నాయకులు జయప్రకాశ్, మోతిలాల్, జంగయ్యయాదవ్, శ్రీనుయాదవ్, ఎర్ర శ్రీను, రషీద్, పర్వత్‌రెడ్డి, హామీద్ ఉన్నారు.

ఆయిల్‌పాం సాగుతో అధిక లాభాలు

- జిల్లా హార్టికల్చర్ ఆఫీసర్ చక్రపాణి

రైతులకు సూచనలు చేస్తున్న డీహెచ్‌వో చక్రపాణి

కల్వకుర్తిరూరల్, జూన్ 24 : ఆయిల్ పాం తోటలను సాగు చేయడం ద్వారా రైతులు అధిక దిగుబడి అధిక లాభాలు సాధించే అవకాశం ఉందని నాగర్‌కర్నూల్ జిల్లా హార్టికల్చర్ సెరికల్చర్ ఆఫీసర్ చక్రపాణి అన్నారు. సోమవారం కల్వకుర్తి మండలం మార్చాలలోని రైతు వేదికలో జిల్లా ఉద్యానవన పట్టు పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో రైతులకు ఉద్యానవన తోటలసాగుపై అ వగాహన కార్యక్ర మం నిర్వహించా రు. ఈ కార్యక్రమాని కి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఆయిల్‌పాం సాగుపైన అవగాహన కల్పించారు. ఆయిల్‌పాం మొక్కల ఎంపిక, మొక్కలు నాటే విధానం, నీటిని అందించే విధానం, చీడపీడల నివారణపైన వివరించారు. మామిడితోటల కొమ్మల కత్తిరింపు ఎరువుల పంపిణీ, కెనోపీ మేనేజ్‌మెంట్ మామిడి తోటల రైతులకు వివరించారు. కార్యక్రమంలో కల్వకుర్తి, కొల్లాపూర్ హెచ్‌వోలు ఇమ్రానా, లక్ష్మణ్, ఏఈవో లక్ష్మి ప్రసన్న, రైతులు ఉన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు అమ్మితే చర్యలు

పుస్తకాలు విక్రయిస్తున్న గదిని సీజ్ చేస్తున్న విద్యా అధికారి

కొల్లాపూర్, జూన్ 24 : కొల్లాపూర్ పట్టణంలోని గోమతి, సెయింట్ జోసెఫ్ పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలను, టై బెల్టు, యూనిఫామ్‌లను విక్రయిస్తున్నారని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రేమ్‌కుమార్ విద్యాధికారులకు ఫిర్యాదు చేయడంతో కొల్లాపూర్ ఎంఈవో కార్యాలయాధికారులు సోమవారం ప్రైవేట్ పాఠశాలలను తనిఖీ చేసి గోమతి, సెయింట్ జోసెఫ్ పాఠశాలల పుస్తకాల విక్రయాలను సీజ్ చేయడంతోపాటు ఉన్నతాధికారులకు నివేదిక అందించారు. కార్యక్రమంలో విద్యార్థి, కార్మిక నాయకులు రవి, కిరణ్ తదితరులు ఉన్నారు.

పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

వెల్దండ, జూన్ 24 : ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు సంతోష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం వెల్దండ ఎంఈవో శంకర్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ధరలకు పుస్తకాలు, టై బెల్టులు, యూనిఫాంలు అమ్ముతున్నారని, అధిక ఫీజులు వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపించారు. వెంటనే వెల్దండ మండలంలో ప్రైవేట్ పాఠశాలలను తనిఖీ చేసి నిబంధనలు పాటించని పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలన్నారు. గిరిజన విద్యార్థి సంఘం మండలాధ్యక్షుడు రాహుల్ నాయక్ తదితరులు ఉన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

లింగాల, జూన్ 24 : బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని పంచాయతీ కార్యదర్శులు వెంకటేశ్, శకుంతల అన్నారు. సోమవారం మండలంలోని అప్పాయపల్లి, శ్రీరంగాపూర్ గ్రామాల్లో కోనేరు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18ఏండ్లు నిండితేనే అమ్మాయికి, 21ఏండ్లు నిండిన తర్వాతే అబ్బాయిలకు పెండ్లి చేయాలన్నారు. చిన్న వయస్సులో పెండ్లి చేయడం వల్ల పుట్టబోయే బిడ్డతోపాటు తల్లి ఆనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. బాల్య వివాహాలను ప్రోత్సహించిన వారిపై జరిమానాతోపాటు జైలు శిక్ష ఉంటుంద న్నారు. కార్యక్రమంలో కోనేరు సంస్థ కో ఆర్డినేటర్ ఆంజనేయులు, శ్రీనివాసులు, ప్రజలు రాము, సలేశ్వరం, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

అచ్చంపేటరూరల్, జూన్ 24 : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లేశ్ డిమాండ్ చేశారు. సోమవారం వారు ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్‌లో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవో కార్యాలయ సిబ్బందికి అందజేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 55వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని ఆరునెలల నుంచి మధ్యాహ్న భోజనం వడ్డించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కార్మికులు పిచ్చమ్మ, మంగమ్మ, రాములమ్మ, చిన్నమ్మ, సాయిలమ్మ, గోరమ్మ, హస్లీ, అలివేల, మౌనిక పాల్గొన్నారు.

ప్రీస్కూల్‌లో విద్యాబుద్ధులు నేర్పాలి

అచ్చంపేట రూరల్, జూన్ 24 : చిన్నారులకు ప్రీ స్కూల్‌లో విద్యా బుద్ధులు నేర్పించాలని ఎంపీపీ శాంతాబాయి అన్నారు. మండలంలోని రైతు వేదికలో అంగన్‌వాడీ టీచర్లకు సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించగా ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో సీడీపీవో, ఏసీడీపీవో, సూపర్‌వైజర్లు ఉన్నారు.

ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

నాగర్‌కర్నూల్, జూన్ 24 : జిల్లా కేంద్రంలో సోమవారం ఫుడ్ సేఫ్టీ అధికారి మనోజ్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పలు రెసిడెన్సియల్ హాస్టళ్లు, పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. ఎస్సీ, ఎస్టీ హాస్టల్, ఆదర్శ రెసిడెన్షియల్స్ తనిఖీ చేసి వంటకాలను రుచిచూశా రు. అదేవిధంగా పాలబూత్‌ను సందర్శించారు.

జిల్లా లెవెల్ స్పోర్ట్స్ స్కూల్ సెలక్షన్స్

అమ్రాబాద్, జూన్ 24: 2024-25 విద్యా సంవత్సరానికి తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ సెలక్షన్స్ టీజీఎస్‌ఎస్ వైస్‌చైర్మన్, డైరెక్టర్ హకీంపేట మేడ్చల్, మల్కాజ్‌గిరి వారి ఆధ్వర్యంలో 4వ తరగతి చదివే విద్యార్థులు స్పోర్ట్ స్కూల్ సెలక్షన్స్ జిల్లాలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మోహన్‌లాల్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల 4వ తరగతి చదివే విద్యార్థులు ఈనెల 28న నాగర్‌ర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగే స్పోర్ట్స్ స్కూల్ సెలక్షన్స్‌కు ఉదయం 8గంటలకు హాజరు కావాలని సూచించారు.

'ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి'

ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ సీతారామారావు

నాగర్‌కర్నూల్, జూన్ 24 : ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించాలని అదనపు కలెక్టర్ సీతారామారావు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణికి 72 ఫిర్యాదులు అందాయి. ఈ ఫిర్యాదుల్లో 47 ఫిర్యాదులు రెవెన్యూ శాఖకు సంబంధించినవి కాగా, కేజీబీవీ, ఐటీడీఏ, డీఎంహెచ్‌వో, ఇరిగేషన్, ఏడీఎస్‌ఎల్‌ఆర్, డీఈవో, ఎస్‌డీకేఎల్‌ఐ శాఖలకు సంబంధించిన ఫిర్యాదులు అందాయన్నారు. ఫిర్యాదులను అధికారులు పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో గోపాల్‌నాయక్, జిల్లా అధికారులు ఉన్నారు.

రహదారిపై గుంతలు పూడ్చివేత

రహదారిపై గుంతలు పూడుస్తున్న కూలీలు

నమస్తే ఎఫెక్ట్

చారకొండ, జూన్ 24 : మండలంలోని జడ్చర్ల-కోదాడ జాతీర రహదారి చారకొండ నుంచి మర్రిపల్లి వరకు గుంతల మయంగా ఏర్పడింది. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం నమస్తే తెలంగాణలో 'గమ్యం చేరాలంటే గగనమే' అనే శీర్షికన సోమవారం నమస్తే తెలంగాణలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జాతీయ రహదారి కాంట్రాక్టర్ స్పందించి రహదారిపై ఉన్న గుంతలను పూడ్చేందుకు కంకర, డస్టు కలిపి మరమ్మతులు చేపట్టారు.

బొగ్గు గనుల వేలం ఆపాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు

వంగూరు, జూన్ 24: బొగ్గు గనుల వేలాన్ని వెంటనే ఆపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వంగూరు మండలంలోని జాజాల గ్రామంలో నిర్వహిస్తున్న సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులకు ఆయన హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి బొగ్గు గనులను ప్రైవేటు సంస్థలకు అప్పగించి రాష్ట్రాన్ని నశనం చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. పేదలకు వెంటనే ఇండ్ల స్థలాలు మంజూరు చేయడంతో పాటు రైతులకు ఉచితంగా ఎరువులను అందించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆంజనేయులు, సీపీఎం మండల కార్యదర్శి బాలస్వామి, నాయకులు శివరాములు, పరుశరాములు, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

సమయ పాలన పాటించని హెచ్‌ఎం

- పాఠశాలకు తాళం
- ఆరుబయటనే విద్యార్థులు, మరో ఉపాధ్యాయురాలు

పాఠశాలకు తాళం ఉండడంతో ఆరుబయటే ఉన్న ఉపాధ్యాయురాలు, విద్యార్థులు

చారకొండ, జూన్ 24: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయులు సమయపాలన పాటించకుండా తమ విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మండలంలోని మర్రిపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 20 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. పాఠశాలలో హెచ్‌ఎం సుభాషిణితోపాటు మరో ఉపాధ్యాయురాలు పద్మ విధులు నిర్వహిస్తున్నారు. సోమవారం హెచ్‌ఎం సుభాషిణి ఉదయం 9గంటలకు పాఠశాలకు రావాల్సింది ఉండగా 9:45 గంటలకు పాఠశాలకు వచ్చింది. అదేవిధంగా పాఠశాల తాళం చెవి కూడా ఆమె వద్దే పెట్టుకోవడంతో మరో ఉపాధ్యాయురాలు పద్మ, విద్యార్థులు హెచ్‌ఎం వచ్చే వరకు ఆరు బయటనే నిరీక్షించారు. ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నాతాధికారులు స్పందించి సమయపాలన పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

విధులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు సమయ పాలన పాటించి విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలి. ఉపాధ్యాయులు విధులపట్ల నిర్లక్ష్యం చేస్తూ సమయ పాలన పాటించకుంటే ఉన్నాతాధికారుల దృష్టికి తీసుకెళ్తా. మర్రిపల్లి ప్రాథమిక పాఠశాలను సందర్శించి విచారణ చేసి చర్యలు తీసుకుంటాం.
- భగవాన్‌రెడ్డి, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం, చారకొండ

పరిహాసంగా 'ప్రజావాణి'

- ప్రతిసారీ అధికారుల డుమ్మా

పెంట్లవెల్లి : అధికారులు లేక వెలవెల బోతున్న ఖాళీ కుర్చీలు

పెంట్లవెల్లి, జూన్ 24 : ప్రజా సమస్యలను క్షేత్ర స్థాయిలో అక్కడిక్కడే పరిష్కరించాలనే సదుద్దేశంతో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రజావాణి కార్యక్రమాన్ని చేపట్టింది.ప్రతి సోమవారం మండల రెవ్వెన్యూ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం అధికారుల డుమ్మాతో పరిహాసంగా మారింది.ఇదేవిధంగా గత 6మాసాలుగా ప్రజావాణికి అధికారులు గైర్హాజర్ అవుతున్న జిల్లా స్థాయి అధికారులు చర్యలు తీసుకోవడంలేదన్న విమర్శలు గుప్పుమంటున్నాయి. అంతేకాదు ప్రజావాణి కార్యక్రమానికి అప్పుడప్పుడు అధికారులు హాజరైనా వివిధ శాఖలకు చేందిన మండల స్థాయి అధికారులకు బదులుగా తమ కింది స్థాయి అధికారులను పంపి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు పలు సమస్యల పరిష్కారం కోసం గతంలో ఇచ్చిన దరఖాస్తులను అధికారులు పరిష్కరించకపోవడంతో ప్రజావాణి కార్యక్రమం పట్ల ప్రజలకు పూర్తిగా నమ్మకంపోయి,ప్రతి సోమవారం జరిగే ప్రజావాణికి దరఖాస్తులు చేసుకోవడానికి వస్తే అధికారులు సమయపాలన పాటించకపోవడంతో ప్రజావాణి కార్యాక్రమం పట్ల ప్రజలు ఆసక్తి చూపడం లేదన్న అపవాద లేకపోలేదు.ఇప్పటికైన సంబంధిత పై అధికారులు స్పందించి ప్రజావాణికి డుమ్మా కొడుతున్న వివిధ శాఖల అధికారులపై చర్యలు తీసుకోని ప్రజావాణి కార్యాక్రమం విజయవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.ఈవిషయంపై తాసిల్దార్ హిమబిందును వివరణ కోరగా ప్రజావాణి కార్యాక్రమానికి డుమ్మా కొడుతున్న అధికారులకు మరోమారు కార్యాలయం తరపున హెచ్చరికలు జారీ చేస్తాను. అధికారుల ప్రవర్తన మారకపోతే జిల్లా స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకుంటామని సమాదానం ఇచ్చారు.

ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దుతాం

కొల్లాపూర్, జూన్ 24: కుడికిళ్ల గ్రామంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలను ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దుతామని కొల్లాపూర్ మండల సింగిల్ విండో డైరెక్టర్ జూపల్లి రఘుపతిరావు అన్నారు. సోమవారం కుడికిళ్ల ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాంలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కారించేందుకు కృషి చేస్తామన్నారు. విద్యార్థులు కష్టపడి చదువుకొని తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకొని రావాలని ఆయన ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలన్నారు. కార్యక్రమంలో మహిళా సంఘాల నాయకురాలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

షెడ్ నిర్మాణానికి సహకారం

ఉప్పునుంతల, జూన్ 24 : మండలంలోని వెల్టూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలకు ఇటీవల బదిలీపై వచ్చిన ప్రధానోపాధ్యాయురాలు వేదవతి తన వంతు సాయంగా రూ.40వేలతో షెడ్‌ను నిర్మించారు. బాధ్యతలు చేపట్టిన వారం రోజులకే ప్రధానోపాధ్యాయురాలు రేకుల షెడ్‌ను నిర్మించి అభివృద్ధికి దోహదపడడంతో ఉపాధ్యాయులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దాత హెచ్‌ఎం వేదవతి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం నాణ్యమైన విద్యతోపాటు అన్ని సౌకర్యాలు కల్పించి ఉచితంగా నోట్‌పుస్తకాలు పంపిణీ చేస్తున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఆమె కోరారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సన్మానిస్తున్న అధ్యాపకులు

కల్వకుర్తి, జూన్ 24 : ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్ర, జిల్లా స్థాయిలో ర్యాంకులు సాధించారు. ఆదిలక్ష్మీ 453, వెంకటేశ్ 450, భవిజ్ఞ 447, శ్రీకర్ 445, త్రివేణి 445, అఖిల 440, ఆరాధ్య 425, నజ్మా బేగం 402, మహమ్మది బేగం 395 మార్కులు సాధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సోమవారం కళాశాలలో ప్రిన్సిపాల్ సురేందర్‌రెడ్డి, అధ్యాపకులు సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ వేణు, అధ్యాపకులు సదానందం, రమాకాంత్, మహమ్మద్ అలీ, శ్రీనివాస్, బాలరాజ్, రాజేశ్, భీమేశ్, జుబేర్, సంతోష్, లక్ష్మయ్య, బాలయ్య పాల్గొన్నారు.

'పద్మావతి' విద్యార్థుల ప్రభంజనం

విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మురళీధర్‌రావు

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 24 : ఇంటర్ అడ్వాన్స్ సప్లమెంటరీ ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని శ్రీనివాస పద్మావతి జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు గానూ 468 మార్కులతో పల్లవి స్టేట్ రెండో ర్యాంక్, కల్యాణి 467 మార్కులతో స్టేట్ మూడో ర్యాంక్ సాధించినట్లు కళాశాల యాజమాన్యం వివరించారు. వీరితోపాటు శ్రీవిద్య 466, బిశాల్ జినా 464 మార్కులు సాధించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ మురళీధర్‌రావు, అధ్యాపక బృందం అభినందించారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

నాగర్‌కర్నూల్, జూన్ 24 : కుటుంబ కలహాలతో నాగర్‌కర్నూల్ మండలం వనపట్ల గ్రామానికి చెందిన చిన్న బాలయ్య (45) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. చిన్న బాలయ్య కుటుంబ సభ్యులతో గొడవ పడి ఈనెల 22న ఇంటి నుంచి వెళిపోయాడు. తెలకపల్లి మండలంలోని దాసుపల్లి గ్రామ శివారులో చెట్టుకు ఉరేసుకున్నట్లు సీఐ కనకయ్య తెలిపారు. మృతదేహం కుళ్లిపోయి ఉండడంతో మొదట గుర్తించలేకపోయామన్నారు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకొని మృతుడి వద్ద గల ఆధార్‌కార్డు ఆధారంగా వనపట్లకు చెందిన బాలయ్యగా గుర్తించినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు సైతం బాలయ్య కనిపించడం లేదని నాగర్‌కర్నూల్‌లో ఫిర్యాదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

కుక్కలదాడిలో జింక మృతి

తిమ్మాజిపేట, జూన్ 24 : మండల కేంద్రంలో కుక్కల దాడిలో జింక మృతిచెందింది. మండల కేంద్రం సమీపంలోని గుట్టల నుంచి సోమవారం ఉదయం మచ్చల జింక వ్యవసాయ పొలాల్లోకి రాగా, కుక్కలు వెంట పడి దాడి చేశాయి. గమనించిన చుట్టుపక్కల ప్రజలు గాయపడిన జింకను చూసి పశు వైద్యాధికారులకు సమాచారం అందించారు. వైద్యుడు శివరాజ్ చికిత్స చేసినా ఫలితం లేకపోయింది. జింక మృతదేహాన్ని గంగారం అడవులకు తరలించారు. ఇదిలా ఉండగా, 15రోజుల్లో మూడు జింకలు మృతిచెందాయి. తిమ్మాజిపేట, పుల్లగిరి, గొరిట అటవీ ప్రాంతాల్లో 100పైగా జింకలు ఉన్నాయని, ఆహారం కోసం గ్రామాలకు వస్తుండడంతో కుక్కల దాడిలో మృతి చెందుతున్నాయని తెలిపారు.

అమర జవాన్ యాదయ్యకు నివాళి

వంగూరు, జూన్ 24 : మండలంలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో అమర జవాన్ మల్లేపాకుల యాదయ్య వర్ధంతి వేడుకలను సోమవారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన విగ్రహానికి వెల్దండ సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, వెల్దండ, చారకొండ ఎస్సైలు రవి, రాజశేఖర్‌తో పాటు గ్రామస్తులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు వేమారెడ్డి, రాఘవేందర్, చందుయాదవ్, అనిల్, వంశీ, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

నాగర్‌కర్నూల్, జూన్ 24 : జిల్లా కేంద్రంలోని తాసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తాసీల్దార్ సుదర్శన్‌రెడ్డి ప్రజలకు సూచించారు. సోమవారం తాసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. వివరాలకు 9618880896 ఫోన్‌నెంబర్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో భూ రిజిస్ట్రేషన్ తాసీల్దార్ చంద్రశేఖర్, నిర్వాహకులు సతీష్, రాజు, సాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిని..

కల్వకుర్తి రూరల్, జూన్ 24 : తాసీల్దార్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని కల్వకుర్తి పట్టణ, మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కల్వకుర్తి తాసీల్దార్ ఇబ్రహీం కోరారు. సోమవారం పట్టణంలోని రెవెన్యూ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు అందలేదని ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను తెలియజేసి పరిష్కరింపజేసుకోవడానికి ప్రజావాణి చక్కటి వేదిక అని తాసీల్దార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయాశాఖల అధికారులు ఉన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

కొల్లాపూర్, జూన్ 24 : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని బీఆర్‌ఎస్వీ నాయకుడు శేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం కొల్లాపూర్ మండలంలోని కుడికిళ్లలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలను స్థానిక గ్రామ యువతతో కలిసి సందర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చాలా సమస్యలు ఉన్నాయని వాటిని ప్రభుత్వం పరిష్కారించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులకు పెద్దపీట వేయాలన్నారు. కార్యక్రమంలో శివశంకర్, హరికృష్ణ, శ్రీను, బందని శివ, బాలకృష్ణ, రాముడు, కేశవులు, రాముడు, తదితరులు ఉన్నారు.

అర్చకులపై ప్రజావాణిలో ఫిర్యాదు

ఊర్కొండ, జూన్ 24 : మండలంలోని ఊర్కొండపేట పబ్బతి ఆంజనేయ స్వామి అలయంలో అర్చకులు భక్తులను పీడించి డబ్బులు వసూలు చేస్తున్నారని సోమవారం కాంగ్రెస్ నాయకులు కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. డబ్బులు లేవని చెప్పినా వినకుండా ఫోన్‌పే, గూగుల్ పే ఆన్‌లైన్ ద్వారానైనా ఇవ్వాలని ఒత్తిడి తెచ్చి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని నాయకులు దండేత్కర్ నాగోజీ అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

రేపు పాఠశాలలు బంద్

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 24 : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఈనెల 26న ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల బంద్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ శివగౌడ్ సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించలేదని మండిపడ్డారు. విద్యారంగ సమస్యలపై నిర్వహించే బంద్‌కు సహకరించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

లింగాల, జూన్ 24 : మండల కేంద్రంలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ అప్పల్ నాయుడు సోమవారం ప్రకటనలో తెలిపారు. విధుల్లో విద్యుత్ స్తంభాలకు లైట్లు అమర్చడాని ఉదయం 7నుంచి 9గంటల వరకు రెండు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని వినియోగదారులు గమనించాలని కోరారు.

గంగారంలో పంటల సర్వే

బిజినేపల్లి, జూన్ 24 : మండలంలోని గంగారంలో సోమవారం ఏఈవో ఫరీద్‌పాషా పంటల సర్వేను నిర్వహించారు. సర్వే నెంబర్ల వారీగా క్షేత్రస్థాయిలో తిరుగుతూ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. పంటల సాగు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో కొనుగోలుకు ఇతర పంట నష్ట సమయంలో ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

నోట్ పుస్తకాలు పంపిణీ

తిమ్మాజిపేట, జూన్ 24 : మండలంలోని ఆవంచ సీపీఎస్, జీపీఎస్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు విద్యా స్వేచ్ఛా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. రూ.40వేల చొప్పున రెండు పాఠశాలల్లోని 240మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, ఇతర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్, ప్రతినిధి వాసుదేవరావు, శేషగిరిరావు మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలో 22 పాఠశాలలను దత్తత తీసుకున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీవో బ్రహ్మచారి, జీహెచ్‌ఎం అమృత, యువ జాగృతి చైర్మన్ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

పుస్తకాలు పంపిణీ చేస్తున్న సభ్యులు